8 జనవరి 2024

వలేటి అనురాధ
1991-92
ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

# చేకూరపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఓరియంటల్ హై స్కూల్ వజ్రోత్సవ సందర్భము.

**<u>వలేటి అనురాధ - తీయని మరచిపోని మధురస్మృతులు</u>**

ముందుగా ఈ పాఠశాల వజ్రోత్సవ వేడుకలు జరుపుకోవటానికి కారణమైన వారికి, తారకనాథ్ గారికి మరియు కమిటీ సభ్యులకు నా ధన్యవాదములు.

అన్నిటికన్నా ముందుగా ఇంతమంది విద్యార్థులను శిల్పాలుగా తీర్చిదిద్దటానికి కారణమైన పాఠశాలను నిర్మింప చేసిన పెద్దలకు నా నమ: సుమాంజలి.

ఆ తర్వాత నా ఈ స్థితికి కారణమైన వారైనా నా తల్లిదండ్రులైన వలేటి హనుమంతరావు, సీతారావమ్మ మరియు నా గురువులకు నా నమ: సుమాంజలి.

నేను 5వ తరగతిని ఉలిచి శ్రీ శారదా నికేతన్ లో అమ్మమ్మ దగ్గర ఉండి చదువుకొని 1988 సంవత్సరంలో 6వ తరగతికి చేకూరపాడు పాఠశాలలో అడుగుపెట్టడం జరిగినది. పాఠశాల అంటే ఒక దేవాలయం, నిజంగా మన పాఠశాల ఒక దేవాలయం లాగే అనిపించింది నేను ప్రవేశ పరీక్ష వ్రాసి పాఠశాలలో చేరటం జరిగినది. ఆ పరీక్ష పాస్ అవటం అనేది నేను ఒక విజయంగా ఫీలయ్యాను. అప్పటికే మా అక్క వలేటి రమాదేవి ఉంది. ఆ పాఠశాలలో సంస్కృతం ఒక ప్రత్యేక సబ్జెక్టుగా ఉంటుంది, సంస్కృతం బాగా చదవాలి అని చెప్పటం జరిగినది.

మేము 6వ తరగతికి వలేటి వారి పాలెం నుండి నడుచుకుంటూ వచ్చే వారము. ఆ క్రమంలో ఒకరోజు పెద్ద గాలి తుఫాను వచ్చింది. ఆ తుఫానులో వర్షం మా ముఖాలకు రాళ్ళు పడినట్లుగా పడింది. కానీ ఎవరము భయపడలేదు ఆ క్రమంలో మా ఊరు వెళ్ళే దారిలో నల్ల వాగులో నీరు వచ్చింది. అవతలికి వెళ్ళలేకపోయాము, అప్పుడు S. నాగేశ్వరరావు (10th Class) సారు పొడవుగా ఉండేవారు, ఒక్కొక్కరిని వాగు అవతల వదిలారు. అలాంటి చాలా సంఘటనలు ఇప్పటికీ మరిచిపోలేనివి.

ఈశ్వరమ్మ, మా అక్క అందరూ దారిలో సినిమాలు స్టోరీస్ చూసినట్లుగానే చెప్తుంటే మేము వింటూ నడుస్తూ ఉండే వాళ్ళము.

ఇంకా అదే సంవత్సరము SPL ఎలక్షన్స్ జరిగాయి. ఆ ఎలక్షన్లలో S.నాగేశ్వరరావు మరియు కాకి వెంకటేశ్వర్లు పోటీ పడటం జరిగినది. అప్పుడు వలేటి ప్రతిమ అక్క (మా అక్క క్లోజ్ ఫ్రెండ్స్) 6వ తరగతిలోకి వచ్చి మీ ఊరు అని నాగేశ్వరరావుకి ఓటు వేయకండి. మేము 10th Class మీరు 6th Class, మేము చెప్పినట్లు ఓటు వేయండి. కాకి వెంకటేశ్వర్లకి ఓటు వేయండి అని ప్రతిమ అక్క చెప్పింది. ఆ విషయం ఇప్పటికీ నాకు నవ్వు తెప్పిస్తుంది ఇప్పటి రాజకీయ నాయకులు లాగా అక్క.

మన ఉపాధ్యాయులు CPL, SPL ఎలక్షన్స్ పెట్టి మన ప్రజాస్వామ్య పద్ధతిని మనకు అప్పుడే అవగాహన పరచారు. పాఠశాల అంటే ఒక దేశానికి మంచి పౌరులను మంచి పాలకులను అందించే సాధనం.

మన పాఠశాలలోని ఉపాధ్యాయులు గురించి నా భావాలను మీతో పంచుకుంటున్నాను.

6వ తరగతిలో నేను మర్చిపోలేని ఉపాధ్యాయులు నరసింహారావు మాస్టారు. చాలా ఆప్యాయంగా ప్రేమగా మాట్లాడేవారు. పాఠం సహజ పరిస్థితులలోకి తీసుకొని వెళ్లి చెప్పేవారు. మాకు ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ చాలా చక్కగా బోధించేవారు. ఆయనతో నాకు ఎప్పుడూ మాట్లాడాలని అనిపించేది కానీ ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరం.

వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు గారి పంచ కట్టు అయితే మరువలేనిది. ఒక తెలుగు సంస్కృతికి నిదర్శనంగా ఆయన వస్త్రధారణ ఉండేది. అంత చక్కగా పంచ కట్టు మరలా ఎక్కడా కనిపించలేదు.

తెలుగు సారు సారంగపాణి సార్. తెలుగును ఎంతో చక్కగా బోధించేవారు. సార్ చెప్పిన గురు, లఘువులు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. కాంపొజిషన్ రాయడం, రాగయుక్తంగా పద్యాలు పాడటం చక్కగా నేర్పించేవారు.

సంస్కృతం సారు మునిరత్నం నాయుడు సారు సంస్కృతం చెబుతుంటే వేదం వింటున్న ఫీల్ వచ్చేది.

8వ తరగతిలో ముఖ్యంగా సూర్య కుమారి మేడం గారి గురించి ఎంత చెప్పినా తక్కువే. మేడం నన్ను ఉపాధ్యాయురాలిగా కాకుండా ఒక తల్లిగా చూసేది. 10వ తరగతిలో పాలెం నుంచి ఇద్దరు అమ్మాయిలం మాత్రమే వచ్చే వారం. మమ్మల్ని కూడా ట్యూషన్ లో చేర్పించారు ఒక ఇల్లు చూసి ఆమె దగ్గర ఉంచారు, ఆ రుణం తీర్చుకోలేనిది.

మేడమ్ N.S., పాఠం చెబితే ఎవరికైనా అర్థం అవ్వాల్సిందే, మేడం పాఠం చెబుతుంటే మరో ప్రపంచం లోకి తీసు కెళ్ళేవారు. మేడం ఉపాధ్యాయనిగా అందరకు ఆదర్శం. అందరూ ఉపాధ్యాయులలో ఒక లేడీ ఉపాధ్యాయురాలిగా సర్వీస్ మొత్తం చేయడం మామూలు విషయం కాదు . (ఒక ఉపాధ్యాయురాలుగా నాకు తెలుసు ఆ సమస్యలు ) అప్పుడు మేడంకి సెపరేట్ స్టాఫ్ రూమ్ కూడా లేదు. ఆవిడ గొప్పతనం నాకు ఇప్పుడు బాగా అర్థం అయింది. 9వ తరగతిలో ఉన్నప్పుడు ఒక రూమ్ గర్ల్స్ కి వెయిటింగ్ రూమ్ గా ఇప్పించారు. ఇప్పటికీ మేడం నాకు రోల్ మోడల్.

సోషల్ ఉపాధ్యాయులు సుబ్బారావు సారు నాకు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ ఆదర్శం. భూగోళం, చరిత్ర, పౌర, అర్థశాస్త్రాలు అందరూ చెబుతారు కానీ సార్ సమాజంలో ఒక బాధ్యతగల పౌరునిగా ఎలా మెలగాలో నేర్పించారు. నైతిక విలువల గురించి చెప్పారు. తను ఆచరించి చూపారు. ఇప్పటికీ పదవీ విరమణ తర్వాత కూడా APTF యూనియన్ మీటింగ్ కు

వస్తారు. పాఠశాల నుంచి బయటకు వెళ్ళిన తర్వాత కూడా నాకు గైడ్గా ఉన్నారు. నాకు జాబు వచ్చిన మొదటిసారి కౌన్సిలింగ్ కూడా వచ్చి నాకు అండగా ఉన్నారు.

ఇప్పటికీ ఆయన అమూల్యమైన సలహాలు నేను అనుసరిస్తాను. నన్ను తోటి ఉపాధ్యాయులు నువ్వు APTF లో ఎందుకు ఉన్నావు అని అడిగితే, నా గురువు దానిలో సభ్యులు, కీలకపాత్ర పోషిస్తారు కావున APTF విలువలు పాటించే యూనియన్ అందుకే నేను చేరాను అని చెప్తాను. 10వ తరగతిలో సార్ ప్రతిరోజు పిలిచి ఎగ్జామ్ ఎలా రాశావు అని అడిగేవారు. విద్యార్థుల పట్ల ఆయన ఆప్యాయత, బాధ్యతే ఈ సంఘటనకు నిదర్శనం.

రామారావు సార్ లెక్కలు చెబుతుంటే నాకు మరో ప్రపంచంలో ఉన్నట్లు ఉండేది. హిందీ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు సార్ హిందీ పట్ల భయం అనేది లేకుండా చేసి, హిందీ బోధించేవారు.

గోపాల్ రావు సార్ ఆడపిల్లలు అనే వివక్ష లేకుండా ఎంతోమంది కబడ్డీ ప్లేయర్స్ ను తయారు చేశారు. పాఠశాల స్థాయిని రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకువెళ్ళారు. ఆటలలో ప్రతి ఒక్కరూ రాణించాలని అందరిని ప్రోత్సహించారు. పాఠశాల నుండి బయటకు వచ్చిన తర్వాత కూడా చాలా ఆప్యాయంగా పలకరించేవారు.

సుధాకర్ సార్ తో నాకు అనుబంధం లేకపోయినప్పటికీ మన పాఠశాల నుండి అనేకమంది సంస్కృతం ఉపాధ్యాయులుగా రాణించారు. దీనికి నిదర్శనం సార్ టీచింగ్ అని చెప్పుకోవచ్చు ఇంకా మన పాఠశాలలో ఉన్న ప్రత్యేకత మన లైబ్రరీ వెంకయ్య సార్ కి ఒక ఒక లైబ్రేరియన్ కి ఉండవలసిన శాంతి, మృదు స్వభావం కలవు.

మనందరి వివరాలు రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది అంటే రంగనాయకులు సార్, శేషయ్య సార్ పనికి నిదర్శనము.

చివరగా మన పాఠశాలను ఒక త్రాటిమీద నడిపించి విద్యార్థులకు క్రమశిక్షణ గురించి ఎప్పటికీ చెప్తూ ఉండేవారు ప్రధానోపాధ్యాయులు గురవయ్య సార్. ఒక ఉన్నత పాఠశాలకు సారధ్యము వహించటం అంటే అంత సులభం కాదు, కానీ గురవయ్య సార్ అది సాధ్యం చేసి ముందు తరం ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలచారు.

కరీముల్లా, సైదా సేవలు కూడా మనం గుర్తుంచుకోవాలి.

నా తరగతిలోని తోటి విద్యార్థుల గురించి చెప్పాలంటే నాకు వాణి బెస్ట్ ఫ్రెండ్ మిగతా అందరితో కూడా నేను ఫ్రెండ్లీ గానే ఉండేదాన్ని. నేను ఎప్పుడూ కట్టా హరి అన్న కన్నా బాగా చదవాలి అని ఎక్కువ మార్క్స్ రావాలని ట్రై చేసేదాన్ని. పదవ తరగతిలో నేను ఎక్కువ మార్క్స్ తెచ్చుకున్నా చివరకు హరి అమెరికా వెళ్ళి, ఉన్నత స్థాయికి వెళ్ళారు, నాకు చాలా సంతోషం. భావి భారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తిలో నేను స్థిరపడటం నాకు ఇంకా సంతోషం.

నాకు ఈ అవకాశాన్ని ఇచ్చినా కమిటీ సభ్యులకు నా ధన్యవాదములు.